

నాపేరు సత్తెవతి— కాని నన్నందరూ సత్తేలని పిలుస్తారు—నా అయ్యకి అమ్మకి నా వొక్కర్తినే బొట్టెని — మావూరు బీమునిపట్నం కాదున్న కోనాడ — మేం బెస్తలం. నాను అమ్మకడుపున పడంగానే మాయింటికి సిరొచ్చిందంట— కామందు గయిరినాయిడు, బాడుగకి మా అయ్యకి ఒక పడవ ఒప్పజెప్పినాడు. పట్టినసేపల్లో సగం ఆడొంతు, సగం మా అయ్యవి.

నాను యీ బూమ్మీద పడ్డరోజంట, సేపలు నింపడానికి వాల,పడవ సాలనేదంట బారెడేసి సేపలు పడ్డయ్యంట. మా అయ్య, నాను పుట్టినానని పేద్దసంబరం జేసినాడు — నా పెద్దకళ్ళు, నా జుత్తుచూసి మురిసిపోనాడు — యింటికి నచ్చిమొచ్చిందన్నాడు — కులమోళ్ళకి పాతికముంతల కల్లు తాగడాని కిచ్చిండు-రేతిరల్లా మా కులమోళ్ళంతా తాగి తందనాలాడి, అలసిసిత్తయి నిద్రపోనారు — అందరూకల్సి నాకెట్టేరు పేరు, సత్తెవతని— బారతంలో సత్తెవతికి సంతనమారాజు బరతయినాడంట —నాకు మారాజొస్తాడని ముసలిగుర్రాల గవరయ్య యికటం ఆడేవోడు—గుర్రయ్యకి బారతం, రామాయణం, తత్వం, ఎన్నో కతలు తెల్సు—రాతిరి కూడుతిన్నాక తాత సుట్టూ అందరం మూగేవోళ్ళం—యెన్నో కతలు సెప్పేవోడు గుర్రయ్యతాత—

నాకు గేనం ఒచ్చినకాడ్నించి, తెల్లార కట్టనే, నేచి, అయ్య యెంటే సవుద్రం వొరకూ యెళ్ళేదాన్ని—రేతిరే అయ్యకోసం సకాళన్నం ఉంచేదమ్మ—మాఅయ్య కూడు తిని. వాలతెడ్డుకి కావిడేసి, సేత్తో అరికన్‌దీపం బట్టుగొని బయల్దేరేవోడు. ఆయేళప్పుడు ఎవురూ నెగిసేవోరుకారు. మొదాటి పడవ మా అయ్యదే-రెండుబల్ల సెక్కలకి తాళ్ళు బిగించికట్టి, యిద్దరు వుజ్జిగాళ్ళ సాయంతో, పడవని సవుద్రంనోకి తోసి, పడవెక్కి, యిరిగిపడుతున్న కెరటాన్ని దాటుకుంటూ బానంలా ముందుకు పోయేవోడు—నానుదీసం పట్టుకొని, వొడ్డునె నిల్సొనేదాన్ని, పడవ దూరంపోయేవొరకూ సూత్తూ—మల్లీ కూడుతిని, ఒడ్డుకొచ్చి, అయ్య పడవకోసరం యెదురుసూత్తూ కూకొనేదాన్ని — బెగిసేపలు పడితే అయ్య బేగి ఒచ్చిసేవోడు — నేనప్పుడు సూరీడు బూమినోపటికి పొయ్యేవొరకూ వొచ్చేవోడు కాదు—

నా నపుడు పదేళ్ళబొట్టెని— ఒక రేతిరి పేద్దగాలివొ టొచ్చినాది— సెవులు సిల్లులు పడేలాగ సవుద్రం గోలపెట్టింది. సవుద్రం పొంగి వూర్ని ముంచేస్తదనుకుంటిని. బయమేసి అయ్య పక్కనో కెళ్ళి తొంగున్నాను. పొద్దుటికి, వానగాలి తగ్గిపోనాయి' మా అయ్య వుజ్జిగోడు సన్నాసి లగెత్తుకుంటూ వొచ్చి అయ్యతో సెప్పిండు గద, గుర్రయ్య పాకకూలి పోనాది, ఆడందులో ఉండి సచ్చిపోనాడని—అందరూ ఆడకెళ్ళినారు — అయ్య వొద్దన్నా యినకుండ, నానూ ఆడకెళ్ళినాను. సచ్చిన గుర్రయ్యని చూస్తే సచ్చినంత బయమేసింది. నా అయ్య అమ్మకూడ అట్టానే సచ్చిపోతే నా గతే మవుద్దని బెంగట్టుకుంది. బెస్తలందరూ, గుర్రయ్య శవాన్ని మోసుకపోయి, కాల్చేసి ఒచ్చినారు. ఆరోజుకాడ్నించి నాకు బెంగగా, బయ్యంగా ఉండేది. అయ్యతో సెప్పినాను, నాకిట్టా బయ్యంగుందని— అయ్య నవ్వి అన్నాడు గందా. 'నానెందుకు సత్తానే... పండు ముసలయ్యే వొరకు సావనే' అని.

నా బతుకులో యిది యికటిమాడింది. నే బెంగెట్టు గున్నట్టే అయ్యింది— ఆరేతిరి వొర్షంబాగాపడి యెలిసింది-సముద్రం నోకి అయ్య యెళ్ళకూడదే అనుకున్నాడు, కాని యెళ్ళేడు—సన్నాసి, అయ్య యిద్దరే యెళ్ళేరు అయ్య పడవమీద

ఆ దినం పొనాకొద్దిన పడవవెళ్ళినాయి సముద్రంనోకి — మద్దినాళ కూడు తినివాము సముద్రపొద్దు కెళ్ళినాను. పొయింత్రం మూడుకల్లా—పక్కినపడవ లొచ్చేసినాయి— యెవురి వొంట్లోనూ సేపలు పడనేదు— అయ్యేడని అడిగినాను—సేపలు దొరుకుతయ్యని అయ్యా, సన్నాసీ కల్సి సానాదూరం సముద్రం నోపటికెళ్ళి పోనారంట — ఒద్దని సెప్పినా యినుకొనేదంట. అమ్మ, నానూ సీకటయిపోయినా ఆడనే కూకుండిపోనాము—రేతిరి ఎనిమిదయినాది—సీకటి, నల్లటి రాచ్చసిలా నాలుగేపులా ముసురుకుంది. దీపాలెలిగించి ఒడ్డంట నాలుక్కొసెలదూరం మా అయ్యపేరు కేకేసూ సానా మద్దేళి ఒచ్చినారు— ఆ సీకట్లోనే నచ్చత్రాల యెలుగులో సముద్రంనో కెళ్ళినారు కొంతమంది—పడవల్నో నడిరేతిరికి పడవలు తిరిగొచ్చేసినయ్యి—ఆళ్ళలియిపు దొరకనేదు — నాను అమ్మ తలబాదుకుంటూ ఏడ్చినాం. పడవ తోవ తప్పిపోయి ఉంటుంది ఉదయంకి తిరిగొస్తార్లే అని ఎవరిపాకల కాళ్ళపోనారు. మాం ఆడేకూకున్నాం—

పొద్దు పొడుస్తుండంగనే పక్కూర్నించి బెస్తలు లగెత్తుకుంటూవొచ్చి సెప్పినారు గోరమైన వోర్త. అయ్యశవం, సన్నాసి శవం ప్రక్కూర్లో సవుద్రపొద్దున తేలిపోనాయి— నెత్తి బాదుకుంటూ ఆడకి పరుగెత్తినాము. మావోడంతా వొచ్చేరు. అయ్య శవం సూడగానే అమ్మ మూరచపోనాది — నాను బియ్యంతో కొయ్యబారిపోనాను.

అట్లాగ పోనాడయ్య. అయ్య పోనాక అమ్మ మరి నోకంనో నేదు — దిగాలుపడిపోనాది—పిచ్చిదయిపోనాది—

సింవాద్రి మా అయ్యకి దగ్గరి నేస్తగాడు—అడ్ని నాను సింవాద్రి మావా అని పిల్చేదాయిని ... ఆడు మమ్మల్ని సేరదీసిండు—దొరికిన సేపల్నో నాలుగోవొంతు వోటా మా కిచ్చేవోడు—నానూ సెంద్రులూ కలిసి, పట్నంనించి సైకిలుమీ దొచ్చే బేరగాళ్ళకి నా వోటా సేపలు దరకట్టి అమ్మేవోళ్ళం.

సెంద్రం, సింవాద్రిమావ బొట్టెడు. నాకన్న రెండేళ్ళు పెద్ద—గేనం వొచ్చినకాన్నించి, మేం యిద్దరం వుజ్జీ. యిద్దరం యెప్పుడూ కల్సి తిరిగేవోళ్ళం — అయ్య సముద్రంమీదికి పోనాక నాను సెంద్రంకాడ కెళ్ళేదాన్ని—యిద్దరం గవిరినాయుడి తోటనోకెళ్ళి, కొగు సెట్టెక్కి, పలకర పుల్లలు తెంపి పలకర జేసూ అట్టాగ సముద్రంకాడికి పోయి, కెరటాల్ని సూతూ కూకొనేవోళ్ళం. అప్పుడే సముద్రంనోంచి తొంగిసూసె సూర్యుడు మమ్మల్ని పలకరించేవోడు — 'ఎట్టాగున్నావు సత్తీ... ఏరా సెంద్రులూ బాగున్నావా?' అని అడిగేవోడు. 'రేతిరేళ సూర్యుడేడ తొంగుంటాడురా' అని అడుగుతే, 'పాతాళ్ళోకంనో రేతిరి రాజ్జం యేలి, పొగలు బూనోకాని కొస్తాడే' అనేవోడు సెంద్రులు సూర్యుడు తొంగిసూడంగానే, సవుద్రం అద్దంనా మెరిసేది — కెరటాలు పాల నురుగుల్నాగ బుస్సులాడుతూ మీదికొచ్చేవి— 'ఒరే సెంద్రం! ఒక్క సెనమన్నా యీ కెరటాలాగిపోవా? ఏ సద్దూ నేకుండా, ఒక్క సెనమన్నా యీ సముద్రం పల్లకుండిపోదా?' అని. సెంద్రం, నా యీపుమీద సరిసి, అనేవోడు—'ఓసి యెర్రిమొకమా! సముద్రం పల్లకుంటాదే? నువ్వూ నానూ సావాలగాని' అనేవోడు. యెండనో, వాననో తిరుగుతూ, సంకులూ, గవ్వలూ అన్ని రంగులవీ ఏరేవోళ్ళం. ఇసకలో గూడు కట్టి ఆడేవోళ్ళం.

అట్లాగాడుకుంటున్నపుడొచ్చి, మా ఆట పాడు జేసేవోడు గవిరి నాయుడి బొట్టెడు రాజయ్య. సెంద్రం ఏంజేత్తే దాని కెతిరేకంగ జేసేవోడు రాజయ్య — రాజయ్యని జూస్తే నా కిష్టంనేదు—ఆడి బుద్దులు మంచివి కావు. యెప్పుడూ తగువులాడే మడిసి— ఆడికి సిన్నపుడే, మరిడమ్మొచ్చి ముకంనిండా గుంటలు పడ్డయ్యి— ఆడికి నాతో నేస్తం కట్టాలని యెంతో ఉండేది. యెప్పుడూ నావెంటె పడేవోడు— రాజయ్య అనేవోడు—'సత్తీ! ఆ సెంద్రుడితో జట్టు కలవమోక! ఆడు మంచోడు కాడు—నాను మా అయ్య నడిగి యెన్నో డబ్బు లొట్టుగొస్తాను — యిద్దరం కరకజ్జం, జీళ్ళు, యేరుసెనగలు కొనుక్కుని తిందాం' అనేవోడు—సెంద్రానికి నాను ఈ సంగతి సెప్తే ఆడేమీ అనేవోడు కాదు — ఆడి గొడవే ఆడిది. 'అన్నియ్యే! మన కేటి!' అనేవోడు—సెంద్రుడంటే రాజయ్యకి కసిగుండేది, నాను ఆడితో తిరుగుతానని—

అయ్య పోనాక, అమ్మ బెంగెట్టుకొని జొరంపడి, ఒక ఉదయం మరి నిద్ర నేవనేదు—ఇంకా తొంగుందని నాను నేపేను—మరెక్కడుందమ్మ—సచ్చి శవమయిపోనాది—నాను గోలు గోలుమ నేడుసూ యెళ్ళి సింవాద్రిమావ నొట్టుగొచ్చేను — యెవురొస్తే యేం నాబం—

నాది పాపిష్ట బతుకు—పాపిష్టదాయిన్నేను—నాను పుట్టాక నచ్చి మొచ్చిందే అనేవాడుట అయ్య – ఆళ్ళిద్దరూ బంగారం పండుద్దని నన్ను చూసి మురిసిపొయ్యేవోరు—నాను నచ్చిందేవినికాదు — జెష్టాదేవినయినాను—అమ్మ శవంమీద పడి అట్టా అంటూ ఏడ్చినాను—నానెందుకుండిపోనాను ఈ బూమిమ్మద — అమ్మా, అయ్యా యాడకి పోనారో ఆడ కెందుకు పోనేను? నాకింకెవురున్నారిక్కడ—యేడుస్తుంటే సెంద్రం కూడా యేడ్చినాడు—సింవాద్రి మావ, నా రెక్కట్టుగొని, బయటి కీడ్చుకెళ్ళి ఊరుకోపెట్టిండు — 'అట్టా బెంగెట్టుగోకె సత్తెలూ! నానున్నానే — నీ అయ్య, అమ్మ అన్నీ నానే అమకో' అని దయిరియం సెప్పినాడు—

అమ్మ పోనాక, నాను సింవాద్రి మావ పాకకి పోనాను—సెంద్రం తల్లి పానాకాలం కిందటే సచ్చిపోనాది—సింవాద్రిమావ మరి పెళ్ళి జేసుకోనేదు—ఆడే వొంటజేసేవోడు. సెంద్రం సాయపడేవోడు. నా నెళ్ళినాక నేవొంటజేసేదాయిని— నాకు వొంట బాగా సేతొచ్చు—

రాతిరేళ ఎప్పుడూ అయ్యా, ! అమ్మ గేపకం ఒచ్చేవోరు. యేవో సెడు కలలొచ్చేవి—నిద్రట్టకపోతే ఒంటిగా సముద్రపొద్దున కూకొని కెరటాల్తో ఊసులాడేదాయిని. 'అమ్మా, అయ్యా యాడనున్నారు?' అని అడిగితే అయి సెప్పేవి— 'ఆళ్ళ పొరగాని కెలిపోయి దేవుళ్ళయిపోనారు— నువెట్టాగున్నావో అడగమన్నారే—నీకాసే సూస్తున్నా రిపుడు. బెంగెట్టుగోక!' అని—సముద్రం దయిర్యం, మద్దతు యిచ్చేది. అప్పుడు సెంద్రులు నన్నెతుక్కుంటూ వొచ్చి నా పక్కన కూకొనేవోడు—నా సెయ్యిదుకొని 'నా నుండగా బెంగేలే?' అని కళ్ళు తుడిసేవోడు—

గేనం ఒచ్చినకాడనించి నాకు సెంద్రుడంటేనే మనసు— ఆడికీ నామీదంతే —

పండిత డి. గోపాలాచార్యులవారి
**అమృత**
స్త్రీల
ఆరోగ్య సౌభాగ్యానికి
1898 నుండి ప్రసిద్ధిగాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
100 జనరల్ రోడ్, మదరాసు-17.

**వాయిదాల పద్ధతి పై ట్రాన్సిస్టర్**

ప్రపంచ ఖ్యాతి పొందిన "నేషనల్ డీలక్స్" 3 బ్యాండ్ ఆల్ వరల్డ్ పోర్టబుల్ ట్రాన్సిస్టర్ను నెలసరి వాయిదాలపై రు. 10/- వంతున చెల్లించి పొందండి. ప్రతి గ్రామానికి, నగరానికి పంపబడును. వివరములకు:
Music&Sound(A S V P.W.M-10)
P. B. 1576, Delhi-6.




# అహారి

అదేటో సెప్పనేకుండేదాయిని — ఆయిది అర్థమయి ఏడిసేది కాదు — కాని ఆడితోనే యెప్పుడూ తిర గాలనీ, మాటాడాలనీ ఉండేది. ఆడికీ అట్టనే అనిపించేదేమో! యెపుడూ యిద్దరం కలిసే తిరుగుతూ ఉండేవాళ్ళం. పదువూ, సంధ్యా— ఏటేనేదు— యెండలో ఎండడం, వానలో తడీడం, యిసకలో ఆడ్డం, సముద్రంలో మునగడం—జీడి తోటకెళ్ళి జీడిపళ్ళు తినడం—మామిడి తోటలో దూరి, మావిడికాయలు దొంగ తనంగ కోసి, ఉప్పూ కార్రా అద్దుక తినడం—కొబ్బరిసెట్లు, తాటిసెట్లు సెంద్రంయెక్కి, కాయలుకోసి కిందపడిస్తే అయి కత్తితో కోసి తిండం, యిట్టా గడిపేసేవోళ్ళం రోజులు—రాజయ్య దూరే వోడిందునోకి—నావెంటే యెపుడూ ఉండా మని దేవులాడేవోడు—ఆడంటే నాకిష్టం నేదని నేనెన్నిసార్లు సెంద్రానికి సెప్పినా ఆడినేవోడు కాదు— 'పోన్లేయే' అనేవోడు.

అట్టాగే ఆరేళ్ళు, సముద్రం కెర టాలోట్టేటు దొర్లిపోనాయి—సూత్తూ, సూత్తూ ఉండంగానే, నాను పెద్దదాన్నయి పోనాను. సెంద్రుడు తాటిసెట్టునాగ ఎదిగిపోనాడు. మూతిమీద ఆడికి మీసం మొలిసింది. వోరంకొకతూరి, మంగలి పైడయ్యసేత గడ్డం గీయిస్తున్నాడు.

నా నెదిగిపోనాక నన్ను సూసుగుంటే నాకే సచ్చే సిగ్గేసేది. అమ్మోరి సంబరా లకి మా అయ్య, బతికున్నప్పుడు కొనిచ్చిన సిన్న అద్దంలో, నాముఖం సూసుకుంటే, నామట్టుకి నాకే అనిపించేది—'యీ మని సెవరా అని'—నా కళ్ళు సేపలంతేసి పెద్దవయిపోనాయి — అందునోకి ఏదో సంతోసం, మెరుపు ఒచ్చినయి — మొకం, సానా మారిపోనాదనిపించినాది — సెంద్రాలే నన్ను వొర్నన సేసుంటే యిట్టా సెప్పి ఉండును:

'సత్తెలు ఎట్టా మారిపొనాది! నాను సిన్నప్పుడు ఎరిగి ఉన్న సత్తెలు కానేకాదు— అదేటో లబ్బో! యెట్టా యెదిగిపోనాది! ఒళ్ళెట్టా నాజూగ్గా తయారయిపోనాది— ఎట్టా నబ్బరు బంతినాగైపోనాది మడిసి— ఆసూపులేటి! సెమక్ సెమక్ మని నచ్చ త్రాలవాగ మెరిసి ఆరి, మెరిసి ఆరు తున్నయ్యి — గెంతులేస్తూ ఎగిరెగిరి తున్నయ్యి— యెట్టా తిప్పుక నడుస్తుంది ఒళ్ళూ, కాళ్ళూ సేతులూ! 'మాసేవా సెంద్రులూ! నేనింత ఒయ్యారంగా ఉన్నానురా! నాను నడుస్తుంటే ఆ అందం నించి నన్ను పోల్చుకోరా! అందుకేరా ఈ ఒయ్యారం' అంటున్నట్టు నడుస్తాది — అట్టాగనీ కాదు — నాను పరకాయించి చూసేసరికి యెంత సిగ్గు! మేగాలేసినపుడు నల్లగుండే సముద్రం నాగుండేది దాని జుత్తు—నల్లసేనం రాయినా నునుపుదేరిన ఒళ్ళు—నల్లగా మెరుస్తూ.

సెంద్రులు యిట్టా యేవేవో సెప్పే వోడు— ఆడి గురించి కూడా నాను సానా సానా సెప్పగలను. గుర్రయ్య తాత సెప్పే వోడు — రామాయనంలో ఆ సీ రాము సెంద్రుడు వల్లగా ఆజాను బాగువు నాగుండే వోడుట—పొడూగు సేతులంట— ఎయ్యేనుగుల బలమంట— అట్టానే వుండే వోడు సెంద్రం—ఆడితో సేపల గురించి కాని, వొంట గురించికాని, మాటాడి నపుడు నాకు సిగ్గయ్యేదుకాని, ఆడ్ని నాను సూడాలని సూసినపుడు, నా ఒళ్ళల్లా ఒణుకుపుట్టి సిగ్గేసేది.

సింహాద్రి మామ ముసలోడయిపోనాడు— సముద్రం నోకెళ్ళడాని కోపికలేదాడికి — గట్టిగా కష్టపడితే గుండెలో పోటొస్తాది—

సెంద్రులే, రాజయ్యకాడ పడవ ఒకటి బాడుగకి తీసుకొని, సాపలు పట్టడాని కెళ్తున్నాడు—గవిరినాయుడు, పెత్తనమంతా రాజయ్యకే అప్పచెప్పినాడు. ఇప్పుడు ఆడు యెజమాని—సెంద్రుడాడికింద పనోడయి పోనాడు—రాజయ్య, నా యెంటపడడం యెక్కువ సేసినాడు. రోజురోజుకి ఆడిబాధ నా కెక్కువయిపోనాది— సిన్నప్పుడు బాధ నేక పోయేది—కాని నాను పెద్దదాన్నయి పోనాక, రాజయ్యగాడి వోటం సాలా యితగాం తయారైపోనాది— ఒకతూరి కొబ్బరితోట నోనుంచి సాయింతరమేళ నే నొంటిగ పోతుంటే, నా యెంట పడి, సీర కొం గొట్టుకున్నాడు—'సి! ఫో! నీ జిమ్మడ!' అని కూకలేసి, పరుగెత్తి, పారొచ్చినాను. గుడిసెకాడ కొచ్చినప్పటికి సెంద్రుడింకా రానేదు—నాను ఏడుస్తూ, తొంగుండి పోనాను—సెంద్రులొచ్చి నేపినాక్కాని తెలివి

రానేదు— సెంద్రుడడిగినాడు—'ఏమే సత్తి ఏడుస్తున్నావు? మీ అయ్య కోసమేనా?' అన్నాడు—నానప్పుడు సెప్పినాను రాజయ్య సంగతి— సెంద్రుడి మొకం యెర్రగయి పోనాది—ఆడికి సానా కోప మొచ్చిందని నాను గ్రహించినాను— యెళ్లి రాజయ్యతో తగువెట్టుగుంటాడేమో నని బయపడినా— రాజయ్యేపుడు పెద్ద మోతుబరి — ఆడితో తగువెట్టుకుంటె ఊళ్లో బతకనేం — సెంద్రులు తమాయించుకొని, కోపం మింగేసి అన్నాడు — 'ఒంటరిగ ఆడికంట బడమాక!'

అయినా రాజయ్య, ఎట్లాగో ఒగనాగ, నన్ను దూరంనుంచన్నా ఒకసారి సూడందే పోయేవాడు కాదు— ఒకపాలన్నాడు – 'నాను అందంగ యెందుక్కనబడతానే నీకు? నీకు ఒళ్లు కొవ్వెక్కిపోనాది—నానూ సూత్తాను ఆడికి నువ్వెట్టా సిక్కుతావో—నాబొందినో పేణం ఉండంగ ఆడికి నిన్ను దక్కనియ్యను.' అట్టా బెదిరించేవోడు — నేదా తిన్నగ గుడిసెకే వొచ్చేసేవోడు — 'యేం సత్తెలూ...సెంద్రు డియ్యాళ సముద్రం[illegible]కి ఎళ్లనేదే' అనుకుంటూ –'యేం ... సత్తెలూ...సెంద్రుణ్ని సీరకొంగుకి కట్టేసుకున్నావ్...ఆడ్ని పనికూడా సెయ్యనియ్యవేటి?' అనేవోడు—నాను ఆడికగపడకుండ పాటుకి పొయ్యేదాయిని — సింవాద్రి మావు నవుతూ అనేవాడు, 'అపుడే ఏటయిందిలా, రాజయ్యా—ఆ మూడుముళ్లా పడనీ — ఆడింక సూర్యుణ్ని కూడా సూడ్డు, అని– నాకు సచ్చినంత సిగ్గేసేది. ఒకేళ సెంద్రులు నేకపోతే సింవాద్రితో కబుర్లు సెపుతూ కూకొనేవోడు రాజయ్య—అర్దా, రూపాయో అట్ట, డబ్బులు ఊరికనే ముసలోడి కిచ్చేవోడు ముసలోడికి తాగుడెక్కువై పోనాది — దానికి డబ్బులు రాజయ్యే ఇచ్చేవోడు—కాలం మళ్లినకొద్దీ ఒక్క చెన మన్నా తాగుడు నేకపోతే ఉండనేకపొయ్యేవోడు సింవాద్రి–


ఒకదినం సెంద్రులూ, నానూ బీవుని పట్నం ఎళ్లినాము నడిసి—సామివోరి ఉత్సవోలు–ఉదయానే ఎళ్లినాం — నరసింహస్వామివోరి సంబరం...కొండమీదున్న గుడిలో సామి యెలిసేరు—కొండెక్కి సూత్తే, ఊరిసుట్టూ సముద్రమే ఉన్నట్టుంటాది — యిద్దరం సామివోరికి కొబ్బరికాయలు కొట్టి, వొంగి దొండం పెట్టినాము— అపుడు యిద్దరం నెంపనేసుకొని, సామివోరికి యిన్నయించుకున్నాం కదా — 'సామీ! మలి సంవత్సరానికి, యేసంగినో, యిద్దరం యినాగమాడి, ఆలుమగలౌతాం— ఏ అడ్డు లేకుండా సూడు బగమంతుడా! మాకు పుట్టే బొట్టెడికి నీ పేరే యెట్టుకుంటాం'—అట్టాగని సెంద్రు లనంగానే నా కెంతో సిగ్గేసింది. 'దేవుడితో నన్నా అట్టాగందుకనాల? నీ కెట్టా తెల్సు బొట్టెడే ఔతాడని' అని మనసునోపట అనుకుంటిని—ఆ దినం యెట్టా మరిసిపోగల్ను? నానూ సెంద్రులూ, సెట్టా పట్టా యేసుకుని, ఆడుతూ పాడుతూ తిరుగు పెయాణం అయినాము— యేడ సూసినా యెంతో సంతోసమే అయినాది— పొలంలోని వొరి సేలు మరీ పచ్చగా అగుపడినాయి— ఆకాసంనో యెగురుతా పొయ్యే కొంగలబారులు, దేవుడి అవుతారాల్లాగ కనిపించినాయి—నీలంగ ఉన్న ఆకాశం మమ్మల్ని 'ఒచ్చి...నా నీలంరంగునో మునిగి ఆడుకోండి' అని పిల్సింది— మైకంనో, సెంద్రుడు నా నడుంసుట్టా సెయ్యేసి నన్ను దగ్గిరగ నాక్కున్నాడు— ఆడట్టా నన్ను ముట్టుగోడం అదే తొలిసారి—ఆచెనం నాకు యీ పెపంచగేనమే పోనాది—నా ఒళ్లు దూదిపింజనాగ తేలిపోనాది—నా మనసు గాలిపడగనా, సెంద్రమండలాని కెగిరిపోవాది—ఆ అనుబగం నా కెప్పుడూ కానేదు—

ఆ రోజా తరువాత, సెంద్రులు మరి నన్ను తాకనేదు–మెడబంచి, తాళి కట్టేనాకగాని ముట్టనె నిన్ను, అనేవోడు–అంత నిజాయితీ అయినోడు—నానే ఆడతో యెకసెక్కాలాడేదాయిని—'ఏలరా ఉత్త బోడి కబుర్లు సెప్తావ్' అని—

యేసవికాలం దగ్గర పడ్డది—యింకా మాయివాగానికి నెలదినాలే గడువున్నది — సెంద్రులు సేపలటోడ్ని, కట్టపడి సేపలు పట్టి అమ్మేక వొచ్చిన సొమ్ములోంచి మిగిల్సి మిగిల్సి మూడొందలు నిలవ జేసిండు, పెల్లి కర్సులకి, నాకు కోకలకి, నా సేతులకి యెండి కడియాలకి, నా ముక్కుకి బంగారునత్తుకి...తాళికి...యీటన్నింటికని సింవాద్రి మావకి తెలీకుండ సాకసూరునో సైకం దాసిండు

పెళ్లెప్పుడో, వోడ వోడంతా సెప్పినాడు — సుక్లపచ్చమంట—ఆదివోరమంట— యెన్నెల యెండలా కాస్తుందట, సముద్రం సొచ్చికం పలుకుతుందంట—వోడ వోడంతా వొస్తారంట—అందరి సమచ్చంనో నాకు తాళి కడతాడంట— వోడందరికీ, దొంగసారా సిత్తుగా పట్టిస్తాడంట—రెండు మేకల్ని సంపుతాడంట— యిట్టాగ, అడిగినోడికీ, అడగనోడికీ సెప్పుకుంటూ తిరిగినాడు.

యీ వార్తిన్నాక రాజయ్య మరి రావడం మానేసిండు—అగుపడ్డమే నేరం—



సింహాద్రి మావ మాత్రం రాజయ్యింటి కెళ్ళి, తాగుడుకి డబ్బులడిగి తీసుకుని, తాగి తొంగుంటాడు— పెళ్ళింక రెండు రోజు లుందనగ, మావకి సురుకు పుట్టి సెక సెకా అన్ని పన్లూ సెయ్యడం అరంబించిండు—సెంద్రులు అ దేప వి కట్టుక తిరుగుతోండు—యిజ్జినారం యెల్లి, పెళ్ళికి సరుకులు, నాకు నాలుగు కోకలు, కొని ఒట్టికొచ్చినాడు—

లగ్గంనాడు, తెల్లార్తుండంగనే, పైడయ్య పన్నాయిమేలంతో పాకముందు కొచ్చి వాయించడం అరంబించిండు—

గయిరమ్మ, నారాయినమ్మ, యింకా మా కులం ఆడోళ్ళు ఒచ్చి, నా తల సీకాయతో రుద్ది తానం సేయించి, పసుపు రాసి, కళ్ళకి కాటిక యెట్టి, సేరడు కుంకంబొట్టు పెట్టి, పసుపుసీర, పసుపు రయిక కట్టిపించి, సెంద్రుడు కొన్న పొమ్మలు తొడిగి, నన్ను పెళ్ళి కూతుర్ని జేసిర్ను—సెంద్రునికి అట్టానే పసుపుబట్టలు కట్టింపించి, ఆడి తలకి పాగా సుట్టి. కళ్ళకి కాటుగెట్టినారు—

లగ్గం, పొద్దుట పదిగంటలకి— పది గంట లయ్యేసరికి సంవుద్రం సాచ్చికంగా, గంగమ్మతల్లి సాచ్చికంగా, ఆకాసం, బూమి సాచ్చికంగా, మా కులంవోల్లందరి సాచ్చికంగ సెంద్రులు నాకు తాలిగట్టి నా బరతయినాడు—నాను ఆడి బారియ నయినాను—

పెళ్ళికి రాజయ్య రానేదు — ఊరిడిచి క్రితంరోజే యెళ్ళిపోనాడన్నారు— పెందల కాడ్నించి ఒంటలు యెరేగా అవుతున్నయ్యి-కూడు తినే యేలకి సాయింత్రం నాలుగయి పోనాది—అందరూ తప్ప తాగేసిర్ను—సింహాద్రిమావ ఆడి స్నేహితుల యింటికి పోనాడు, వోరందినాల వోరకు పాకకి రానని సెప్పి—

సాయింత్రం నాలుగ్గంటల యేలప్పుడు యిస్సింత్రంగ యేడనుండొ ఆకాసమల్ల మేగాలొచ్చి కప్పేసినయ్యి బూతంనాగ—సెణంనోపట, ఉరుములు, పిడుగులతో వోర్సం కుండ పోతగ కుర్సింది—అందరూ యెవరి పాకల కాళ్ళు పోనారు—నానూ సెంద్రులూ మిగిలిపోనాం—

ఆడు నాకేసి సిలిపిగా జూసి, నాసెయ్యట్టు గొని, నన్ను దగ్గరిగా తీసుకోబోతుండు, అప్పుడు అటాత్తుంగా, అ వోరసంనోంచి మెరుపునాగ, పిడుగునాగ వొచ్చి పాకనో పడ్డాడు రాజయ్య, పేద్ద కేకలు పెడుతూ—ఆడు సెంద్రుడి కాళ్ళు సుట్టేసుకున్నాడు—'ఒరే సెంద్రులూ! మా అయ్యని రచ్చిం చరా! ఇయ్యాళేం పోయికాలం బుద్ధి పుట్టినాదో, యిద్దరు బెస్తుల్ని సాయం తీసుకొని ఆడి పడవనో సరదాకి సేపలు పట్టడాని కెళ్ళినాడ్రా—ఉదయమనగా యెళ్ళినాడు—యిట్టాంటి వోరసం ఒస్తాదని యెరగనుకుంటిరి. పడవేటయి పోనాదో! నాకు సాయం రావడానికేడూ లేదు. తప్పతాగి తొంగున్నారు—నువ్వే నాకు సరను! యిద్దరం యెల్దాం... అయ్యని రచ్చించాల!' అని లబోదిబోమని సెంద్రుడి పాదా లొట్టుకొని యేడ్చిండు—నాను కొయబారిపోనాను— ఏటి యిత




ఆ జలుబును అరికట్టుండి!

అమృతాంజన్ ఇన్‌హేలర్

నిరపాయనుగా, త్వరగా ముక్కుపడిశమును పోగొట్టును. తల శీతలమును నివారించును. తుమ్ములను నిలుపును. చేతనుంచు కోడానికి అనువైనది, సులభంగా వాడవచ్చు, తక్కువ ఖరీదు ఎల్లప్పుడు మీ వద్ద ఉంచుకోండి.




తయారుచేయువారు:
అమృతాంజన్ లిమిటెడ్, మద్రాసు-4.

రీశం! ఏటి సొద్యం! మా పెళ్లి యియాల జరగడమేటి... నానూ, వొబర్తి ఒక సేనమన్నా ఇంకా ఒంటరిగ ఉండక ముందే యీ బెమ్మరాచ్చసుడిట్టా రావడ మేటి! ముసలిగయిరినాయిదు, యెప్పుడూ వెంది యియ్యాలే సంవుద్రంనో కెల్లడ మేటి—యీ వొర్సం యిప్పుడే రావడ మేటి...అందరూ తాగి పడుకోడం... యీడికి సెంద్రుతే కావల్సిరావడం... యిచ్చింత్రం! పోనీ యింత యిసురుగ ఉన్న పముద్రంనోకి ఒక సెంద్రుల్నే పంపుతే ఏదో మోసం ఉందనుకోవొచ్చు—ఆడుకూడా యెల్తున్నాడే—నిజం కాకపోతే ఆ డెలాగ్డా?

నాను బొమ్మనా పెలనం లేకుండ ఉండిపోనాను.

సెంద్రుడు మరి మాటనేకుండ, రాజయ్య సెయ్యొట్టుగొని ఆ సీకటినోకి సొచ్చుక పోనాడు—అంతే—అదేదో కలనో అందమైన నీడ మడిసొచ్చి మాయమయిన లాగ, సెంద్రుడు నా బర్తయి, సెనమన్నా ఉండకుండా మాయమైనాడు.

## లహరి

కొయ్యబొమ్మనా ఒంటిగా పాకలో కూకుండిపోనాను—కాలసెక్రం తిరిగి పోనాది— మినుకు మినుకుమంటున్న బుడ్డి దీవంకాసి సూతూ నిముషాలు లెక్కపెడుతూ కూచున్నాను, ఏసడైనా సెంద్రుడేమోనని ఉలికిపడి నేస్తూ.

రేతిరి రెండు జాములు దాటిపోనాది — వొర్సం యెలిసింది—ఒక్కమేగమన్నా ఆకాశంమీద నేదు—సెంద్రుడు యెన్నెల కురిపిస్తుండు—నాను పాకనించి బయటకొచ్చినాను. యెక్కడా పిట్టమడిసి లేదు. అంతా సడి లేకుండా ఉంది. నాను సముద్రంకాడ కెళ్లి, కెరటాల్నే కాళ్లెట్టుగొని కూచుండి పోనాను. నా పసుపు సీరని కెరటాలు తడుపుతున్నయ్యి. పసుపంతా గంగనోకల్సి పోనాది.

నాను, ఆ నిసిరేతిరి, సముద్రంనోకి కేకేసినాను. 'సెంద్రులూ! నా దేవుడా! యాడున్నావు! యాడికి పోనావు!' అని.

కాని జవాబు నేదు—అంతా మాటుమడిగి, వొల్లకాటిలా నిశ్శబ్దమయిపోనాది. కను సూపుమేర, యెన్నెలలో, సముద్రం అగపడ్డది. కాని పడవ అగపడనేదు.

నాకు ఏడుపు ఆగనేదు. కంటికీ, మింటికి ఏకదారగ ఏడ్సేను. నా బతుకు పాసిష్టి బతుకు. నాను పుట్టడం యీ బూదేవికి బరువు — నా తల్లికి కడుపు సేటు, అయ్యని పొట్టనెట్టగున్నాను. నా నేడనుంటే ఆడనే సెడు యెంట తగిలింది యియ్యాళ, యీ ఒక్కదినం, నా సిటికంత బతుకునో మరిసిపోలేని మంచి రోజనుకుంటిని. కాని నా పాలిటి యమదూతలా, రాజయ్య సుడిగాలినా ఒచ్చి సెంద్రాన్ని యెగరేసుకపోనాడు.

నాకు, బూమి ఆకాశం కదిలేలా నోరెట్టి సముద్రాన్ని, గోససేస్తున్న కెరటాల్ని అడిగినాను — నా పసుపు సిరని తాకుతున్న గంగమ్మ తల్లీ! యియ్యాళ, నా వోడు మెడకి గట్టిన తాళి పట్టుగొని యేడుకుంటున్నాను! సిన్నప్పటికాడనించి నాతో మంతనాలాడేవు. ఎన్నో సంగతులు సెప్పేవు! యీ ఒక్కతూరీ మాటాడు! నా బరత, నా సెంద్రం సేమంగున్నాడా? రాజయ్య ఆడ్నీ, తననీ సంపేసి, పంపేసుకుందుకి సెంద్రాన్ని తీసుకపోనాడా?...గంగమ్మతల్లీ! నా పసుపు కుంకం కాపాడు ... సెప్పు... ఒక్కపాలి చెప్పు ... నాతో మాటాడు...' నా గొంతు సముద్రం కడుపునోకి సొచ్చుక పోనాది...

కాని...సముద్రం పల్లకుండి పోనాది... ఆ నిస్సబ్దంనో, నల్లటి తిమింగలం లాటిది కెరటాల్లో తేలుతూ ముందు కొచ్చినాది...నాను సముద్రంనోకి పరుగెత్తి నాను...అది పడవే...పడవే...నా సెంద్రం... రాజయ్య యెళ్లిన కాలీ పడవ...!

నా నింక బతకనేను ... నా రాజులేని బతుకు నాకొద్దు ...యీ దుక్కం యింతతో సరిపోనీ... నాను పోతున్నాను ... యింకా నోతుకి...సముద్రం నోపటికి... ఆడనుండే ఉంది దారి సొరగానికి... నా వోడు ఆడనే ఉంటాడు... మునిగి పోతున్నాను... మునిగి పోనాను...

'సెంద్రులూ!...సెం...ద్రూ...!'


మీ అందమైన శిరోజములకు పోషణ మరియు పుష్టి అవసరము

బెంగాల్ కెమికల్స్



కాంతర్ డైన్ హేర్ ఆయిల్



నిడుపాటి నిగనిగలాడే, మృదువైన కేశములు పెరుగుటకు సహాయపడును. ముతికి చేరనీయదు. రాలిపోవడం నిల్పును.

బెంగాల్ కెమికల్
కలకత్తా * బొంబాయి
కాన్పూరు * ఢిల్లీ